సాక్షి ఒడిశా
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం ၊ 20 ၊ అక్టోబర్ ၊ 2025

సమైక్య ఒడిశా నిర్మిద్దాం

• గవర్నర్ పిలుపు



హరేకృష్ణ మహతాబ్ 125వ జయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న గవర్నర్ హరిబాబు

భువనేశ్వర్: ఉత్కళ కేసరి డాక్టర్ హరేకృష్ణ మహతాబ్ ఆదర్శాలు, దార్శనికతను ప్రతిబింబించే సుసంపన్న, శక్తివంతమైన, స్వావలంబనతో కూడిన సమైక్యమై ఒడిశాను నిర్మించడానికి కలిసి పనిచేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి కోరారు. కటక్ నగరంలో సరళ భవన్‌లో జరిగిన డాక్టర్ హరేకృష్ణ మహతాబ్ 125వ జయంతి వేడుకల్లో గవర్నర్ మాట్లాడుతూ గొప్ప నాయకుల జీవితం కేవలం గుర్తుంచుకోవాల్సిన కథ మాత్రమే కాదు అనుసరించాల్సిన సందేశం అని అన్నారు. ఆయన ప్రయాణంలోని ప్రతి అధ్యాయం మనకు దృఢ సంకల్పం, ధైర్యం, దార్శనికతతో జీవించడానికి స్ఫూర్తినిస్తుందన్నారు.

డాక్టర్ మహతాబ్ జమిందారు కుటుంబంలో జన్మించినప్పటికీ, త్యాగం, ప్రజా సేవతో కూడిన జీవితాన్ని ఎంచుకున్నారని డాక్టర్ కంభంపాటి



జయంత్యుత్సవానికి హాజరైన ప్రముఖులు

పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో చేరడం ద్వారా, నిజమైన నాయకత్వం అంటే వ్యక్తిగత సుఖం కంటే సామూహిక సంక్షేమం పరిరక్షణ శక్తివంతమైనదనే సందేశం ఆదర్శప్రాయంగా పేర్కొన్నారు. వికసిత్ ఒడిశా కోసం, పరివర్తనాత్మక మార్పు కోసం పనిచేయడానికి మార్గనిర్దేశం చేయాలి అని ఆయన అన్నారు.

ఆధునిక ఒడిశాను రూపొందించడంలో డాక్టర్ మహతాబ్ దార్శనిక పాత్రను హైలైట్ చేస్తూ, భువనేశ్వర్‌ను రాష్ట్ర కొత్త రాజధానిగా స్థాపించడం, హిరాకుడ్ ఆనకట్టను నిర్మించడం, పరిశ్రమలు మరియు విద్యా సంస్థలను ప్రోత్సహించడంలో ఆయన చేసిన చొరవలను డాక్టర్ కంభంపాటి గుర్తుచేశారు. 'ఇవి కేవలం పాలనా చర్యలు మాత్రమే కాదు, స్వావలంబన మరియు సాధికారత కలిగిన ఒడిశాను నిర్మించడంలో మైలురాళ్లు' అని ఆయన అన్నారు. రచయిత, సంపాదకుడు, సామాజిక సంస్కర్తగా ప్రజాతంత్ర, ఝంకార్ ద్వారా ప్రజా చైతన్యాన్ని మేల్కొల్పిన డాక్టర్ మహతాబ్ సహకారాన్ని కూడా గవర్నర్ ప్రశంసించారు. 'ఒడిశా ఆత్మ దాని భాష, సంస్కృతి వారసత్వంలో ఉంటుందని ఆయన విశ్వసించారు' అని డాక్టర్ కంభంపాటి అన్నారు.

సరళ సాహిత్య సంసద్ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గవర్నర్ ప్రశంసిస్తూ, ఒడిశాకు ఉజ్వల భవిష్యత్‌ను రూపొందించడానికి ధైర్యం, సమగ్రత, దూరదృష్టితో డాక్టర్ మహతాబ్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని ప్రతి ఒక్కరినీ కోరారు. కటక్ ఎంపీ భర్తహరి మహతాబ్, ప్రొఫెసర్ ఖారవేళ మహంతి, సరళ సాహిత్య సంసద్ అధ్యక్షుడు ప్రభాకర్ స్వంయి, మాజీ ప్రధాన కార్యదర్శి, రచయిత సహదేవ సాహు, ప్రొఫెసర్ నిరంజన్ త్రిపాఠి, సరళ సాహిత్య సంసద్ కార్యదర్శి మాట్లాడారు.

నియమగిరిలో మావోల కోసం పోస్టర్లు



కళ్యాణసింగుపూర్ సమితి కార్యాలయం గోడకు అతికించిన పోస్టర్లు



నియమగిరి పర్వత ప్రాంతాల్లో దర్శనమిస్తున్న మావో పోస్టర్లు

రాయగడ: నియమగిరి పర్వత ప్రాంతాల్లో మావోయిస్టుల బెడద నుంచి ప్రజల్ని విముక్తి కలిగించడంతో ఆ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు ఒడిశా పోలీసులు మరో అడుగు ముందుకు వేశారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పరిధిలో గల నియమగిరి పర్వత ప్రాంతాల్లో అదేవిధంగా మునిగుడ, చంద్రపూర్ సమితుల్లో గల వివిధ ప్రాంతాల్లో మావోయిస్టులను పట్టుకోండి.. అందుకు తగ్గ బహుమతులను పొందండి అన్న నినాదాలతో పోస్టర్లు అతికించారు. కళ్యాణసింగుపూర్ సమితి పర్కాలి పంచాయతీ కార్యాలయం, అదేవిధంగా సమితి కార్యాలయాల్లో ఈ తరహా పోస్టర్లు దర్శనం ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ పోస్టర్లలో మావో కేంద్ర కమిటీకి చెందిన గణేష్ ఉయికే, స్వతంత్ర జోన్ కమిటీ సభ్యులు నిఖిల్ ఒరాఫ్ శివాజీ, సుదర్శన్ ఒరఫ్ వికాష్, అంకిత ఒరఫ్ ఇందు, శుక్ర ఒరప్ క్రిష్ణ, నితు, అన్వేష ఒరఫ్ రేణు, డివిజినల్ కమిటి సభ్యులు మమత ఒరఫ్ సాయితేజ్, నకుల్ ఒరప్ చంద్ర తదితర మావో నేతల ఫొటోలతో పాటు వారి పక్కనే ప్రకటించిన బహుమతి నగదును ముద్రించారు. ఎవరైనా వారి (మావో) వివరాలు కచ్చితంగా తెలియజేస్తే వారి వివరాలు పోలీసులు గోప్యంగా ఉంచుతుందని అదేవిధంగా పట్టిన మావొయిస్టుకు ప్రకటించిన బహుమతి నగదును అందజేస్తామని పోస్టర్లలొ ప్రచురించి ఏర్పాటు చేయడం విశేషం. గత కొద్ది కాలంగా నియమగిరి పర్వత ప్రాంతాల్లొ మావొ కదలికలు ఎక్కువగా ఉండటంతొ వారిని అనిచివేసే ప్రక్రియలొ భాగంగా ఒడిశా ప్రభుత్వం ఈ మేరకు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని ఆ ప్రాంత ప్రజలు గుసగుసలాడుకొవడం వినిపిస్తుంది.

న్యూస్‌రీల్

మహిళా డిగ్రీ కళాశాలలో పోషణ వారోత్సవాలు

పర్లాకిమిడి: స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో పోషణ వారోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల విశ్రాంత అధ్యక్షులు డాక్టర్ భారతీ పాణిగ్రాహి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గ్రామాల్లో నివసిస్తున్న కిశోర బాలికలు, గర్భిణులు పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పోషక ఆహారం అందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల అధ్యాపకులు డాక్టర్ కళ్యాణీ మిశ్రా పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



కల్వర్టు పనులు జరుగుతున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని రెండవ వార్డు శంకర్‌బాస్ చెరువు వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో పెద్ద కల్వర్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.7 కోట్లతో శంకర్‌బాస్ చెరువు, కాలవ గట్టు, డ్రైనేజీ కల్వర్టులు నిర్మిస్తున్నారు. దీంతో బస్టాండ్‌కు వెళ్లే వాహనాలను దారిమళ్లిస్తున్నారు. మరో పది రోజుల్లో కల్వర్టు పనులు పూర్తవుతాయని బరంపురం కంట్రాక్టరు తెలియజేశారు.

నాటు బాంబులు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు బాంబులు



సీజ్ చేసిన మందు గుండు పదార్థాలు

భువనేశ్వర్: పూరీ పట్టణ ప్రాంతంలో అక్రమ బాణాల తయారీ స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరు బస్తాల్లో నాటు బాంబులను స్వాధీనపరచుకున్నారు. ఈ ప్రాంగణంలో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్నట్టు ఆరోపణలపై ఒకరిని అరెస్టు. సదర్ పోలీసులు పూరీ నరహరిపూర్‌లోని శ్రీకాంత్ మిశ్రా ఇంటిలో ఈ బాంబుల తయారీ కొనసాగుతున్నట్లు నిర్ధారించి అతన్ని అరెస్టు చేసినట్లు పూరీ సదరు ఠాణా పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

జయపురం: జయపురం రైల్వే స్టేషన్‌లో జయపురం అబ్కారీ విభాగ సిబ్బంది ముగ్గురు వ్యక్తులను సోదా చేసి వారి బ్యాగ్‌లో ఆరు కిలోల గంజాయి పట్టుకున్నట్లు జయపురం అబ్కారీ విభాగ అధికారి శశికాంత దత్ వెల్లడించారు. అరెస్టయిన వారు కొట్‌పాడ్ సమితి కలియపాదర్ గ్రామం దీనబందు పెంటియ(25), కయగుడ ధవుడపల్లి మోచిరాం కుంభార్(25)రామనాథ్ కుంభార్(31)లు అని వెల్లడించారు. వారి నుంచి స్వాధీన పరచుకున్న గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందని అంచనా. ఆయన వివరణ ప్రకారం ఆదివారం ఉదయం అబ్కారీ అధికారి శశికాంత దత్, ఓబిసీ సుబ్రత్ కేశరి హిరన్, ఏఎస్ఐ బలరాం దాస్ అబ్కారి సిబ్బందితో పెట్రోలింగ్ జరుపుతున్నారు. ఆ సమయంలో రైల్వే ప్లాట్ ఫారంపై ముగ్గురు వ్యక్తులు నించుని ఉన్నారు. సామలేశ్వరీ ఎక్స్‌ప్రెస్ రైలు కోసం వారు వేచి చూస్తున్నారు. వారిపై అనుమానం వచ్చి అబ్కారీ సిబ్బంది బ్యాగ్‌లను తనిఖీచేయగా వాటిలో గంజాయి బయట పడింది. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రాంతంలో గంజాయి కొని ఇతర ప్రాంతాల్లో అమ్మేందుకు తీసుకు వెళ్తున్నట్లు అబకారి అధికారి వెల్లడించారు.

నేటి నుంచి కాళీ పూజలు ప్రారంభం



ఆకట్టుకుంటున్న పూజా పెండాల్

రాయగడ: స్థానిక బ్లాక్ కాలనీ సమీపంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలొ కాళీ పూజలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 42 సంవత్సరాలుగా ఈ పూజలను నిర్వహిస్తుండటం విశేషం. ఈ నెల 31వ తేదీ వరకు పూజలు కొనసాగుతాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 11 రోజులు జరిగే కాళీపూజల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆహ్వాన, సూర్యపూజ, మండపం శుద్ధి, సంధ్యా దేవి స్వాగతం, కళశ ప్రదర్శన, ద్వార పాల, ప్రాణప్రతిష్ఠ తదితర పూజలను నిర్వహిస్తారు. అలాగే ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు మా గురుతార, త్రిపుర సుందరి, భువనేశ్వరి, త్రిపుర భైరవి, చిన్నమస్త, ధూమావతి, బగలాముఖి, మాతాంగిణి, కమలాత్మిక, బాల్యకుమార్, పూర్ణాహుతి పూజలు ఉంటాయని అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ పట్నాయక్ చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది 200 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 50 వేల మంది రోజూ అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో పోలీసుల భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. రోజూ రాత్రి వేళ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

సంప్రదాయ పోటీలు ప్రారంభం



తరుణ ప్రజ్ఞా భారతి వార్షిక పోటీలను నిర్వహిస్తున్న బృందం



గీతా పఠన పోటీలలో పాల్గొన్న వారు



యోగా కార్యక్రమంలో పాల్గొన్న వారు

జయపురం: ప్రాచీన సంప్రదాయ సంస్కృతి, కళలు, నృత్య సంగీతాల పరిరక్షణ కోసం నెలకొలిప్న జయపురం తరుణ ప్రజ్ఞా భారతి-2025 వార్షికోత్సవాల పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎన్‌కేటీ రోడ్డు నారాయణి ఆంగ్ల పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగ గురువులు జానకీ పాణిగ్రాహి, కృష్ణారావు దొరలు ఉత్కళ ఆరాధ్య దైవం శ్రీజగన్నాథునికి దీప ప్రజ్వలన చేసి ప్రారంభోత్సవం చేశారు. సూర్య నమస్కారాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలోయోగాసనాలు, శంఖనాథం, హుళి హుళి శబ్దాలు, భారతీయ సంస్కృతిపై వకృత్వ, గీత శ్లోకాల పఠనం పోటీలు నిర్వహించారు. జయపురం తరుణ ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు తపన కుమార్ త్రిపాఠీ మాట్లాడుతూ మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు కళలు క్రీడలు పరిరక్షణ కోసం డాక్టర్ గంగాధర నందో తరుణ ప్రజ్ఞా భారతిని స్థాపించారని, ఆయన ఆశయాల మేరకు ఏటా సంప్రదాయాలపై పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజ్ఞా భారతి ఉపాధ్యక్షులు రామశంకర షాడంగి, కార్యదర్శి అజయ కుమార్ మల్లిక్, సహాయ కార్యదర్శి సువర్ణ ఖిళో, కోశాధికారి రవీంద్ర మహరాణలతో పాటు సబిత త్రిపాఠఋ, తపశ్వినీ కుమారీ సాహు, లిపికా దొలాయి, రీతాంజళి డాకువ, జి. మహేష్, జగన్నాథ్ పాణిగ్రహిల సహకారంతో నిర్వహించిన పోటీల్లో న్యాయ నిర్ణేతగా మనోజ్ మిశ్ర, క్షీరోద్ సాహు, మృత్యంజయ సాహు, సంజుక్త రౌత్ పాల్గొన్నారు.

471 పంచాయతీ కార్యాలయాలకు శంకుస్థాపన



పంచాయతీ కార్యాలయాలకు వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: గ్రామీణ ప్రాంతాల్లో సుపరిపాలన మెరుగుదల కోసం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆదివారం లోక్ సేవా భవన్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 471 గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంత్యోదయ గృహ యోజన మొదటి విడతను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి అంత్యోదయ గృహ యోజన కింద 48,693 మంది లబ్ధిదారులకు మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ. 40,000 చొప్పున పంపిణీ చేశారు. గ్రామీణ ఒడిశాలోని నిరుపేద కుటుంబాలకు పక్కా ఇల్లు అందించడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. నువాపడా, కలహండి మినహా అన్ని జిల్లాల్లో 471 గ్రామ పంచాయతీ కార్యాలయాలకు శంకుస్థాపనలు జరిగాయి. ప్రతి కార్యాలయం రూ.35 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తారు. కేంద్రం, రాష్ట్రం సంయుక్త నిధులతో ఈ భవనాలు నిర్మించి వన్-స్టాప్ సేవా కేంద్రాలుగా పనిచేయిస్తారు. సర్పంచ్, పంచాయతీ కార్యనిర్వహణ అధికారి, జూనియర్ ఇంజనీర్, గ్రామ రోజ్‌గార్ సేవక్, అకౌంటెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసం ఈ సముదాయంలో ప్రత్యేక గదులను కలిగి ఉంటాయి.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజా సేవల పంపిణీ, పాలనను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతను ఈ చొరవ ప్రతిబింబిస్తుందన్నారు. ఈ ఏడాది మార్చి 30న ప్రారంభించబడిన అంత్యోదయ గృహ యోజన 2027-28 నాటికి పేదల కోసం 5 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పేర్కొన్నారు. దీని కోసం బడ్జెట్‌లో రూ.7,550 కోట్లు కేటాయించారు. ఈ పథకంలో భాగంగా ప్రతి లబ్ధిదారునికి 3 విడతలుగా సమగ్రంగా రూ. 1.20 లక్షలు అందజేస్తారు. తొలి విడతలో రూ. 40,000, రెండవ విడతలో రూ. 65,000 చివరగా మూడవ విడతలో రూ.15,000. నాలుగు నెలల్లోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు రూ. 20,000, 6 నెలల్లోపు పూర్తి చేసిన వారికి రూ. 10,000 చొప్పున ప్రోత్సాహకం లభిస్తుంది. ప్రస్తుతం 28 జిల్లాల్లో 48 వేల 693 మంది లబ్ధిదారులు తొలి విడత నిధులు అందుకున్నారు. వారందరికి సమగ్రంగా రూ. 1,947.72 కోట్లు పంపిణీ చేశారు. అన్ని ఇళ్లలో మరుగుదొడ్లు, పైపుల ద్వారా నీటి సరఫరా వంటి అవసరమైన సౌకర్యాలు ఉంటాయి. ఈ పథకంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతన ఉపాధికి సంబంధించిన నిబంధనలు ఇమిడి ఉన్నాయి. ప్రతి పేద మరియు నిస్సహాయ కుటుంబానికి సురక్షితమైన, శాశ్వత ఆశ్రయం కల్పించడం లక్ష్యం. తద్వారా వారు గౌరవంగా జీవించగలుగుతారని ముఖ్యమంత్రి వివిధ పంచాయతీల లబ్ధిదారులు, సర్పంచ్‌లకు ఉద్దేశించి వర్చువల్‌గా సంభాషించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, తాగు నీటి విభాగం మంత్రి రబీ నారాయణ్ నాయక్ ప్రసంగిస్తూ గ్రామ పంచాయతీ భవనాలు గ్రామీణ పాలనకు కీలకం అని అభివర్ణించారు. పౌరుల అంచనాలకు అనుగుణంగా అట్టడుగు స్థాయిలో సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ భవనాలు ప్రజా సేవ మరియు గ్రామీణాభివృద్ధిలో ఒక కొత్త మైలురాయిగా మారతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, పంచాయతీ రాజ్, తాగునీటి శాఖ డైరెక్టర్ వినీత్ భరద్వాజ్, పంచాయితీ రాజ్ కమిషనర్ కమ్ సెక్రటరీ గిరీష్ ఎస్.ఎన్. స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వంయి, 28 జిల్లాల నుంచి జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సెల్ఫీ సరదా..

• జలపాతంలో జారిపడిన యువకుడు



జలపాతంలో పడిపోయిన యువకుడు

రాయగడ: సెల్ఫీ తీసుకుంటుండగా ఓ యువకుడు అదుపుతప్పి జలపాతంలో జారిపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. సదరు సమితి దుర్గాపాడు జల పాతం వద్ద ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గాయాలకు గురైన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తోటి స్నేహితులు తరలించారు. వివరాల్లోకి వెళితే.. సమితి పరిధిలోని జమిడిపేట సమీపంలో ఉన్న దుర్గాపాడు గ్రామం వద్ద జలపాతం సందర్శించేందుకు కొంతమంది పర్యాటకులు వెళ్లారు. ఈ క్రమంలో ఎత్తయిన రాళ్ల మధ్య నిలబడి సెల్ఫీ తీసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడిన ఆ యువకుడు తీవ్రగాయాలకు గురయ్యాడు. అయితే యువకుని వివరాలు తెలియాల్సి ఉంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా సమాచారం. దుర్గాపాడు జలపాతం వద్ద ఇటువంటి అందమైన ప్రదేశాలు ఉండటంతో పాటు ఫొటోలకు అనుకూలంగా జలపాతాలు, సుందర దృశ్యాలు ఉండటంతో ముచ్చటపడి అక్కడకు వెళ్లిన పర్యాటకులు ప్రమాదాలకు తరచూ గురవుతున్నారు. జిల్లా యంత్రాంగం ఈ నేపథ్యంలో చర్యలు తీసుకుని ఆ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పర్యాటకులు అంటున్నారు.

చిలికా సరస్సులో చిక్కుకున్న పడవ



చిలికా సరసులో చిక్కుకున్న ప్రయాణికుల పడవ

భువనేశ్వర్: యాంత్రిక లోపం కారణంగా పడవ చిలికా సరసులో మధ్యలో చిక్కుకుంది. ఈ పడవలో 40 మంది ప్రయాణికులతో పాటు 15 వాహనాలు ఉన్నాయి. జొహ్నికుదొ నుంచి సతొపాడా తీరానికి వెళుతుండగా మంహిషాకుద్దొ సమీపంలో గంటసేపు పడవ అకస్మాత్తుగా స్తంభించి పోయింది. నిస్సహాయ స్థితిలో ప్రయాణికులు బిక్కుబిక్కుమని గడిపారు. మార్గమధ్యంలో ఇంజిన్ అకస్మాత్తుగా ఆగిపోయింది. పునరుద్ధరణకు సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించక పోవడంతో ఈ పరిస్థితి తాండవించిందని ప్రత్యక్ష సాక్షుల కథనం. అదృష్టవశాత్తు ఈ సంఘటనలో ప్రాణ హాని ఇతరేతర నష్టం సంభవించ లేదు. సహాయక బృందం ఘటనా స్థలానికి చేరి పడవలో చిక్కుకున్న వ్యక్తులతో సహా వాహనాల్ని సురక్షితంగా గమ్యం చేర్చింది. ఈ సంఘటనపై సర్వత్రా విచారం వ్యక్తం అవుతోంది. చిలికా సరసులో పడవ సేవల నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై ఆందోళనలను రేకెత్తించింది.

సంస్కారవంతమైన సమాజమే ధ్యేయం కావాలి

• సాహితీ సభలో వక్తలు



హాజరైన సాహితీ ప్రియులు, రచయితలు



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రకాశ్ చంద్రదాస్

జయపురం: కుసంస్కారాన్ని రూపుమాపి సంస్కారవంతమైన సమాజ నిర్మాణమే ప్రధాన లక్ష్యం కావాలని అందుకు సాహిత్యం బీజం వేయాలని ప్రముఖ ఒడియా దినపత్రిక ప్రమయ జయపురం ఎడిషన్ బ్యూరో, డీజీఎం ప్రకాశ చంద్రదాస్ అన్నారు. ప్రముఖ సాహితీ వేత్తలు హరిహర కరసుధా పట్నాయక్, జానకీ పాణిగ్రహిలు దీపావళి సందర్భంగా సంయుక్తంగా స్థానిక సాహితీ భవనం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సాహితీ సభలో ప్రకాశ చంద్ర దాస్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ధనం, భోగం, విలాసాలే కుసంస్కారానికి మూల కారణాలు అన్నారు. వాటితోనే నేడు సమాజం నడుస్తుండడంతో శాంతి, సంస్కారం, క్రమశిక్షణ, సామరస్యతలకు మనిషి దూరమవుతున్నాడని అన్నారు. బుద్ధుడు, అశోకుడు, మహాత్మాగాంధీ చూపిన నీతి, ఆదర్శం, అహింసలను మనిషి మరిచిపోయి అక్రమ మార్గాలలో వేగంగా ఫలితాలు పొందాలని భావిస్తున్నారని అన్నారు. ఇలాంటి సంస్కృతిని విడనాడాలన్నారు. మన అందమైన భవిత మన చేతుల్లోనే ఉందన్నారు. ప్రతిఒక్కరూ మన భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని తెలుసుకొని లాభం, మోహం, ఈర్ష్య, ద్వేషం, హింస, అహంకారం విడనాడాలని పిలుపు నిచ్చారు. ఈ దుర్గుణాల నుంచి ప్రజలను దూరం చేసే శక్తి సాహిత్యానికి ఉందన్నారు. సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి మంచి సాహిత్యం అందించాలన్నారు. సాహిత్యకులు, ఉపాధ్యాయుడు డాక్టర్ జుగల్ కిశోర్ మిశ్ర, అధ్యాపకులు డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ మాట్లాడుతూ.. సంస్కారాన్ని ఎలా నిరోధించాలి, ఆరోగ్యకరమైన, ఆదర్శ సమాజాన్ని ఎలా నిర్మించాలో వివరించారు. జిన్ను పండ, కాంచన సాహు, ప్రజాపిత బ్రహ్మ కుమారి సంస్థ బీర కిశోర్ హత్త, నిరంజన్ పాణిగ్రహి, మీణతి దాస్, సబిత శతపతిలు సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్రను వివరించారు. కార్యక్రమంలో సినీ నటులు ప్రకాశ మహంతి, డాక్టర్ శుదాంశు శేఖర పట్నాయక్, సురేష్ హత్త, న్యాయవాది మదన మోహననాయిక్, శౌభాగిణి నందో, భారతీ మిశ్ర, ఉమారాణి దాస్, నందినీ పట్నాయక్, మీణ కేతన దాస్, కనకలత రథ్, ప్రమోద్ కుమార్ రౌళో, భారతీ మిశ్ర, అశోక్ కుమార్ పొలాయి, సుక్తా సాయి పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ ఆపరేషన్ సేవ



రైలు నుంచి గర్భిణిని దింపుతున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది



రైల్వే ప్లాట్‌ఫాం నుంచి గర్భిణిని వీల్ ఛైర్‌లో అంబులెన్స్ వద్దకు తీసుకువస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆపరేషన్ సేవలో భాగంగా గర్భిణీ ప్రయాణికురాలికి సకాలంలో ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించి తమ ఔదర్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే... శనివారం కొరాపుట్ నుంచి భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో గర్భిణి నేహానాగ్ తన భర్తతో కలిసి కొరాపుట్ నుంచి బయలు దేరారు. హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లోని ఏ-1 కోచ్‌లొ బెర్త్ నంబర్ 49లో ప్రయాణిస్తున్న ఆమెకు ప్రసవ నొప్పులు రావడంతో వాట్సాప్ మెసేజ్ ద్వారా ఆమె భర్త తహీర్ అహ్మద్ రైల్వే ఆపరేషన్ సేవకు సమాచారం అందించారు. దీనిపై స్పందించిన రైల్వే (విశాఖపట్నం) అధికారులు రాయగడ రైల్వే ఆర్‌పీఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. రాయగడకు శనివారం రాత్రి 11.20 గంటలకు ఒకటో ప్లాట్‌ఫాంకు చేరుకుంది. అప్పటికే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఏడీఎం డాక్టర్ ఎల్.ఎన్.స్వయి, వైద్య సిబ్బందితో వద్ద వేచిఉన్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది గర్భిణిని ట్రైన్ నుంచి కిందకు దింపారు. అనంతరం వైద్య సిబ్బంది పరీక్షించిన వెంటనే ఆమెను ఆస్పత్రికి చేర్పించాలని సూచించడంతో అంబులెన్స్ సహాయంతోకు తరలించారు.

క్లుప్తంగా

మందుగుండు సామగ్రి సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ

పొందూరు: పొందూరులో ఎటువంటి లైసెన్సు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని సామగ్రి సీజ్ చేసినట్లు ఎస్సై వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మార్కెట్ వీధిలో దీపావళి సామాన్లు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా రూ.1,09,623 విలువైన మందుగుండు గుర్తించామన్నారు. పొట్నూరు వెంకటరావు వద్ద రూ.40,088, జామి మణికంఠ వద్ద రూ.59,717, గుడ్ల రవి వద్ద రూ. 9,818 విలువైన సామగ్రి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

'నాభూమి..నాదేశం' స్మారక శిలాఫలకం కూల్చివేత



విక్రంపురం వద్ద నాభూమి నాదేశం స్మారక శిలాఫలకాన్ని కూల్చివేసి చదును చేసిన దృశ్యం



గత ప్రభుత్వంలో చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన శిలాఫలకం(ఫైల్)

టెక్కలి: గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా టెక్కలి మండలం విక్రంపురం వద్ద ఎర్ర చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన 'నాభూమి నాదేశం' స్మారక శిలా ఫలకాన్ని కూల్చివేశారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగానికి గుర్తుగా.. భావి తరాలకు పుడమితల్లి విలువను తెలియజేసే విధంగా.. మాతృభూమి రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు గుర్తుగా ప్రతి పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వీటిని నిర్మించారు. దీనిలో భాగంగా టెక్కలి మండలం బొప్పాయిపురం పంచాయతీ విక్రంపుర వద్ద స్మారక శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు దానిని కూల్చివేసి ఒక వైపు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని.. మరో వైపు స్వాతంత్య్ర సమరయోధులు, వీరుల త్యాగాన్ని నేలమట్టం చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కంచిలి: బూరగాంలో జాతీయ రహదారి పక్కన ఇటీవల మతిస్థిమితం లేని వ్యక్తి ఫిట్స్‌వచ్చి పడి ఉండగా శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతిచెందాడు. మృతుడి వయసు సుమారు 45 ఏళ్లు ఉండవచ్చని, గోధుమ రంగు టీ షర్టు, నలుపు ప్యాంట్ ధరించి ఉన్నాడని, వివరాలు తెలిస్తే కంచిలి పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఆర్జీయూకేటీలో క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఈ నెల 21 నుంచి 27 వ తేదీవరకూ క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్ -2025 నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పరిశోధన అంశాలకు సంబంధించి వినియోగిస్తున్న క్వాంటమ్ టెక్నాలజీపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించా లని ఐబీఎం క్వాంటమ్ సంస్థ నిర్ణయించిందని తెలిపారు. దీని కోసం కొన్ని విద్యాసంస్థలను ఎంపిక చేసి అక్కడ సదస్సులు నిర్వహించనున్నారు. నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు నేరుగా నాలుగు వేల మంది విద్యార్థులు, ఆన్‌లైన్‌లో మరో ఆరువేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు అమరావతి క్వాంటమ్ వ్యాలీ సలహాదారు, ఐబీఎం క్వాంటమ్ ఇండియన్ లీడర్ ఎల్. వెంకటసుబ్రహ్మణ్యం హాజరై ప్రసంగించనున్నారని, తర్వాత 3 రోజులు పాటు దేశ, విదేశాల నుంచి వచ్చే నిపుణులు అవగాహన కల్పించనున్నారని చెప్పారు. రెండు రోజులు పాటు హ్యాకథాన్ నిర్వహించి, చివరి రోజు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. క్యాంపస్‌లో సీఎస్ఈ విద్యార్థులు దూదేకుల ఖాశివంలి, కాటం నిఖిల్‌తేజ, చెరుకూరి ప్రవీణ్‌కుమార్, తృతీయ సంవత్సరం చదువుతున్న చదువుల జాన్‌బాబు, ద్వితీయ సంవత్సరం విద్యార్థి కిమిడి గుణశ్రీలు రెండేళ్ల నుంచి క్వాంటమ్ టెక్నాలజీపై అధ్యయనం చేస్తూ పలు సదస్సులకు హాజరయ్యా రని చెప్పారు. క్వాంటమ్ టెక్నాలజీకి వీరు ఆలోచనలు పంపగా ఐబీఎం సంస్థ గుర్తించి ఈ సదస్సు నిర్వహణకు ఎంపిక చేసిందని డైరెక్టర్ తెలిపారు.

నవభారత నిర్మాణంలో..ఆర్ఎస్ఎస్‌ది కీలక పాత్ర



మజ్జిగుడలో సమావేశమైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

కొరాపుట్: నవ భారత నిర్మాణంలో రాష్ట్రీయ స్వయం సేవక్‌ది కీలక పాత్ర అని పశ్చిమ ఒడిశా ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్ హరేకృష్ణ మజ్జి పేర్కొన్నారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్య్రం ముందు నుంచి హిందూ ఐక్యత కోసం ఆర్ఎస్ఎస్ పోరాటం చేసిందన్నారు. మనకు బయట ఎవరూ శత్రువులు లేరన్నారు. మనలో ఐక్యత లేక పోవడంతో అదే శత్రువుగా మారిందన్నారు. ప్రతి వ్యక్తి సామాజిక ఐక్యతతో ఉండాలన్నారు. సొంత కుటుంబంతో ప్రేమ, ఆప్యాయతలతో గడపాలన్నారు. ప్రభుత్వం ఆస్తి, ప్రజల ఆస్తి అని గుర్తించాలన్నారు. పన్నులు, విద్యుత్ బిల్లులు, ఇతర ప్రభుత్వ చెల్లింపులు దేశభక్తితో జరగాలన్నారు. ప్రతి వ్యక్తి మొక్కలు నాటడం, కాలుష్య వ్యతిరేక పోరాటం చేయాలన్నారు. సమాజంలో నాణ్యమైన విలువులతో సంభాషణలు చేయడం అవసరమన్నారు. మాతృ భాష, స్వదేశీ ఉత్పత్తుల విని యోగం అలవాటుగా మారాలన్నారు. ఈ సందర్భంగా రెండు వేల మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తమ సంప్రదాయ దుస్తులు ధరించి భారీ ప్రదర్శన చేశారు. ఈ ర్యాలీ చమిరియాగుడ నుంచి మజ్జి గుడ జంక్షన్ వరకు సాగింది. బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి సాధారణ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నబరంగ్‌పూర్ జిల్లా సర్ సంఘచాలక్ జుదిష్ట గోండో, ప్రత్యేక పరిశీలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం (రాజమండ్రి), తదితరులు పాల్గొన్నారు.



వేదికపై హరేకృష్ణ మజ్జి, జుదిష్ట గొండో, ఎస్.సుబ్రహ్మణ్యం



ఆర్ఎస్ఎస్ ర్యాలీలో పాల్గొన్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

షణ్ముఖపాత్రోకి ఘన నివాళి



షణ్ముఖపాత్రో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

కొరాపుట్: గుండె పోటుతో మరణించిన ప్రముఖ న్యాయవాది, సంఘ సేవకుడు షణ్ముఖ పాత్రో (50)కి న్యాయవాదులు నివాళులర్పించారు. నబరంగ్‌పూర్ బార్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు.

నబరంగ్‌పూర్‌లో న్యాయవాద వృత్తి ప్రారంభించి అనంతరం సుప్రీం కోర్టులో న్యాయవాదిగా సేవలు అందించారన్నారు. ఈ ప్రాంతంలో గిరిజనుల సేవలకు ప్రారంభించిన గోవిందాలయ ట్రస్ట్‌కి సహాయ, సహకారాలు అందించడానికి న్యాయవాదులు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్ అహ్మద్, సంతోష్ మిశ్ర, రఘునాథ పాడి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఆపలేదని నిరసన



ఆర్టీసీ బస్సును అడ్డుకున్న మహిళలు

పోలాకి : బస్సు ఆపడం లేదంటూ బెలమర జంక్షన్ సమీపంలో జీడిపప్పు ఫ్యాక్టరీ వద్ద మహిళలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ సాయంత్రం 5.30 సమయంలో గుప్పెడుపేట-నరసన్నపేట ఆర్టీసీ బస్సు ఫ్యాక్టరీ వద్ద ఆగడంతో మహిళా కార్మికులు ఎక్కేవారు. ఉచిత బస్సు పథకం వచ్చిన తర్వాత డ్రైవర్ బస్సు ఆపడంలేదు. ఇదేంటని మహిళలు ప్రశ్నిస్తే అక్కడ స్టాప్‌లేదని, ముందున్న స్టాప్ దగ్గరకు రావాలని దురుసుగా సమాధానం చెప్పడంతో మహిళలు ఆగ్రహించి బస్సును రోడ్డుమీదే ఆపేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంజిత్ డ్రైవర్, మహిళలతో మాట్లాడారు. రిక్వెస్ట్ స్టాప్‌గా పరిగణించాలని సూచించడంతో వివాదం సద్దుమణిగింది. దాదాపు 20 మంది మహిళలు నిత్యం బస్సుకోసం వేచి ఉన్నచోట కాదని, ఇంకోచోట స్టాప్ ఉందని తప్పించుకుంటే ఊరుకునేది లేదని మహిళలు స్పష్టం చేశారు. టికెట్ తీసుకున్నపుడు ఉన్న స్టాప్, ఉచితం అన్నప్పుడు ఎందుకుండదని నిలదీయటం గమనార్హం.

వృద్ధుడు ఆత్మహత్య

రణస్థలం: లావేరు మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన గురజాపు అప్పలనాయుడు (69) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలనాయుడు ఈ నెల 10న సాయంత్రం మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. భార్య మందలించడంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు హెచ్‌సీ ఎం.విజయానంద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘మట్టి ప్రమిదలు వాడుదాం’



ఎకో క్లబ్బు విద్యార్థినులకు మట్టి దీపాలు చేయటం నేర్పుతున్న గోప సుందర పాణి గ్రహి



మట్టి దీపాలు చేస్తున్న ఎకో విద్యార్థినులు

జయపురం: దీపావళికి ప్రకృతికి నష్టం వాటిల్లకుండా చూసుకుందామని జయపురం సిటీ ఉన్నత పాఠశాల ఎకో క్లబ్బు విద్యార్థులు కోరుతున్నారు. మట్టి దీపాలు వెలిగించి ఘనంగా దీపావళి జరుపుకోవాలని కోరుతూ ఓ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. వారు స్వయంగా మట్టి దీపాలు (ప్రమిదలు) తయారు చేస్తూ వాటిని ప్రజలకు చూపి మట్టి దీపాలు వెలిగించాలని ఉద్బోధిస్తున్నారు. మట్టి దీపాలు ఎలా తయారు చేయాలో స్థానిక మట్టి వస్తువులు తయారు చేసే గోప సుందర పాణిగ్రహి సిటీ ఉన్నత పాఠశాల సెక్యూరిటీ గార్డు సునీల భొత్రలు ఎకో క్లబ్బు సభ్యులకు వివరించి వారిచే స్వయంగా చేయించారు. దీపావళిని ప్రతి విద్యార్థి మట్టి దీపాలతోనే ఇంటిలో జరుపుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం ఎకో క్లబ్బు ఉపాధ్యాయులు ప్రతాప్ కుమార్ పట్నాయిక్, సిటీ ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర పట్నాయిక్ నిర్వహిస్తున్నారు.



మట్టి దీపాలతో ఎకో క్లబ్ విద్యార్థినులు

పుట్టినరోజు నాడే విషాదం

- మొగదాలపాడు బీచ్‌లో యువకుడు గల్లంతు
- కింతలి ఖాజీపేటలో విషాదఛాయలు



అలబాన జగదీష్ కుమార్ (ఫైల్)



యువకుడి స్నేహితులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

గార/పొందూరు: పుట్టిన రోజు వేడుకల కోసం స్నేహితులతో కలిసి సముద్ర స్నానానికి వచ్చిన యువకుడు గల్లంతైన ఘటన మొగదాలపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం కింతలి ఖాజీపేట గ్రామానికి చెందిన అలబాన జగదీష్‌కుమార్ విశాఖపట్నంలోని ఐటీఐ చదువుతున్నాడు. దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన జగదీష్‌కు ఆదివారం పుట్టిన రోజు కావడంతో మరో నలుగురి స్నేహితులతో కలిసి గార మండలం వత్సవలస పంచాయతీ మొగదాలపాడు వచ్చారు. సాయంత్రం బీచ్‌లో స్నానానికి దిగిన ఐదుగురు కేరింతల్లో ఉండగా భారీ అలకు జగదీష్ గల్లంతయ్యాడు. వెంటనే గాలించినా జాడ దొరకలేదు. మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఘటనా స్థలానికి వెళ్లి సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. జగదీష్ స్నేహితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. జగదీష్ తండ్రి గోవిందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు, గాలింపు చర్యలు చేపట్టామని ఏఎస్ఐ తెలుగు చంద్రశేఖర్ తెలిపారు.

ఉరివేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య

కంచిలి: మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన బోర జోగమ్మ(73) ఆదివారం ఉదయం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. జోగమ్మకు చిన్నకోడలు సరస్వతితో శనివారం చిన్నపాటి గొడవ జరిగింది. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు సరస్వతి అత్త జోగమ్మకు టిఫిన్ ఇచ్చి వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం 8 గంటలకు అత్త జోగమ్మ ఉంటున్న ఇంటికి స్నానానికి వేడి నీళ్లు పట్టుకుని వెళ్లి చూసేసరికి జోగమ్మ తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని కనిపించిందని మృతురాలి చెల్లెలు ఆబోతు తులసమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఈ మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, జోగమ్మకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు శ్యామలరావు మస్కట్‌లో, చిన్న కుమారుడు భాస్కరరావు దుబాయ్‌లో వెల్డింగ్ పనిచేస్తున్నారు. పెద్దకుమారుడి కుటుంబం విశాఖపట్నంలో ఉండగా, చిన్నకుమారుడి కుటుంబం కర్తలిలో ఉంటున్నారు. జోగమ్మ ఇరు కుటుంబాల వద్ద చెరో మూడు నెలలు ఉంటోంది. 50 రోజుల క్రితం జోగమ్మ కర్తలి గ్రామానికి వచ్చింది. ఇంతలో విషాదం చోటుచేసుకుంది.

ముంచెత్తిన వాన



బెండిగేటు వద్ద గోతుల్లో చేరిన నీటితో వాహనచోదకుల ఇక్కట్లు

వజ్రపుకొత్తూరు రూరల్: వాతావరణ మార్పుల ప్రభావంతో వజ్రపుకొత్తూరు మండలంలో రెండు రోజులుగా వర్షాలు ముంచెత్తుతున్నాయి. కాశీబుగ్గ కేటీ రోడ్డు, బెండిగేటు-పూండి కూడలి, అక్కుపల్లి-కాశీబుగ్గ రోడ్లు జలమయమయ్యాయి. ఆయా రహదారుల్లో ఏర్పడిన గోతుల్లోకి వర్షపు నీరు చేరడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. వరద ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

24న పాతపట్నంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాతపట్నంలోని కిరణ్మయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో డాక్టర్ రెడ్డీస్, హెట్రో, టాటా ఎలక్ట్రానిక్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, కియా మోటార్స్‌తో సహా మొత్తం 11 ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల అభ్యర్థులు అర్హులని తెలిపారు. కాకుళం, విశాఖపట్నం, శ్రీసిటీ (నెల్లూరు), హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో సుమారు 500 ఉద్యోగావకాశాలు లభిస్తాయని వివరించారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.a p.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. ఫొటోలు, ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు మేళా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8317652552 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా నరక చతుర్దశి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ఉద్యావన మండపంలో ఆదివారం సాయంత్రం నరకచతుర్దశి ఘనంగా జరిగింది. దీపావళి పండగ సందర్భంగా ముందుగా ఉషా పద్మిని ఛాయా సమేతంగా సూర్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను తిరువీధిగా తీసుకువచ్చి ఉద్యాన మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో నరకాసురుడి ప్రతిరూపాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సురభి మహోత్సవం



సురభి మహోత్సవంలో పాల్గొన్న అతిథులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి పుప్పుగాం గ్రామ పంచాయతీ పుప్పుగాం ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో క్లస్టర్ స్థాయి సురభి 2025 శిశు మహోత్సవం నిర్వహించబడింది. ఈ ఉత్సవంలో సర్పంచ్ ముకుంద సమరత్, బ్లాక్ అదనపు విద్యాధికారి పొపెయి బెహర, సమితి సభ్యులు చంద్రికా కెందులియ, కుంద్ర సమితి ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు త్రినాథ్ పండా, క్లస్టర్ సురభి కోఆర్డినేటర్ సంజయ శాంత్ర, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బిజయ కటువ హాజరయ్యారు .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి బీఈఓ పొపెయి బెహర ప్రసంగిస్తూ.. చదువుతోపాటు ఆటలు, కళలు, సంస్కృతి ద్వారా విద్యార్థుల భవిష్యత్ వికసిస్తోందన్నారు. శిశు మహోత్సవం సురభి ప్రధాన లక్ష్యం అదేనన్నారు. ఈ కార్యక్రమంలో 25 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వారిలో డొంగరపంశి ఉన్నత ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అన్నింటిలోనూ ప్రథమ స్థానాలలో నిలిచినట్లు అధికారులు వెల్లడించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కె.కమళాపతి పాత్రో, దిలీప్ దాస్, దీపక్ శతపతి, జితేంద్ర భట్, మితున్ ముజుందార్, రష్మిత పండా, తదితరులు పాల్గొన్నారు.

డీఏ ప్రకటన కంటితుడుపు చర్య

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్నికల ముందు అన్ని వర్గాల ప్రజలతో పాటు ఉద్యోగులకు అనేక అమలు చేయలేని హామీలిచ్చిన చంద్రబాబునాయుడు 16 నెలల తరువాత ఒక్క డీఏ మాత్రమే ప్రకటించడం భావ్యం కాదని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కూరు ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. ఉద్యోగులకు ఆశ కల్పించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక ముఖం చాటేయడం సిగ్గుచేటన్నారు. పీఆర్‌సీ, ఐఆర్ కాకుండా ఒక్క డీఏ ఇవ్వడం దారుణమన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రులు సొంత పనులకోసం కోట్లాది రూపాయిలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న కూటమి సర్కారుకు పెన్షనర్లు, ఉద్యోగుల సంక్షేమం పట్టడం లేదని దుయ్యబట్టారు. ఇదే వైఖరి కొనసాగిస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

శ్రీకాకుళం: రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు కంటితుడుపు చర్యగా రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏ మాత్రమే ప్రకటించడం సరికాదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పేడాడ కృష్ణారావు, పూజారి హరిప్రసన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు, విశ్రాంత ఉద్యోగులకు కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నా వాటిని చెల్లించకుండా బకాయిపడిన నాలుగు డీఏలలో కేవలం డీఏ చెల్లించడం ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిదర్శనమన్నారు. మధ్యంతర భృతి ప్రకటన చేయకుండా, మూడేళ్లుగా ఉద్యోగుల సంపాదిత సెలవుల డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేదని ఒకవైపు చెబుతూనే, మరోవైపు విశాఖపట్నంలో ప్రతిపాదిత గూగుల్ డేటా సెంటర్‌కు సంవత్సరానికి 22 వేల కోట్ల రూపాయలు రాయితీని ప్రకటించడం దేనికి నిదర్శనమో ముఖ్యమంత్రి సమాధానం చెప్పకుండా, ఉద్యోగ వర్గాలను నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదన్నారు.

శ్రమదానం



శ్మశాన వాటికను శుభ్రం చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పాతపట్నం రోడ్డులో మహేంద్రతనయ నది వద్ద ఉన్న శ్మశాన వాటికను గ్రీన్ ఎర్త్, జిల్లా యంత్రాంగం, గాయత్రీ పరివార్ కలిసి ఆదివారం ఉదయం శుభ్రం చేశారు. దీపావళి పురస్కరించుకుని పలువురు పితృకర్మలు మహేంద్ర తనయ నది వద్ద చేస్తారు. మహేంద్రతనయ ఒడ్డున ఉన్న శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, బూడిద తొలగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనింగ్ అధికారి దిపేన్ పోరిడా, ఆదర్శ పోలీసు స్టేషన్ ఎస్ఐ ప్రఫుల్ల జగదానంద, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్‌కుమార్ మిశ్రా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేంద్ర పట్నాయక్, కార్యదర్శి ఎం.పృథ్వీరాజ్, గాయత్రీ పరివార్‌కు చెందిన మనోజ్ దాస్, సంతోష్ గంతాయత్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం



సిసిడి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో యోగా చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం, ప్రపంచ మానసిక స్వస్థ్య దినోత్సవం సందర్భంగా శ్రీధర్‌నగర్‌లో ఆదివారం సి.సి.డి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో పతంజలి యోగా సభ్య బృందానికి మానసిక ఆరోగ్య సూత్రాలను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి మానసిక వైద్యులు ప్రాణ్ రంజన్ నాయక్ తెలియజేశారు. మానసిక రోగులు ఎలా ప్రవర్తిస్తారు, వారి రోగ లక్షణాలు, ఉపశమనం గురించి తెలియజేశారు. యోగా క్రమం తప్పకుండా అభ్యసించడం వల్ల కొన్ని మానసిక రుగ్మతలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్యులు సతీష్ కుమార్ మహాపాత్రో, జతిన్ పట్నా, ప్రదీప్ కుమార్ మహాపాత్రో, తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

• కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రజలందరూ ఆనందాల దీపావళి జరుపుకోవాలని కోరుతూ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలను కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దీపావళి పండగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకి అని ఈ శుభ సదర్భంగా జిల్లాలోని ప్రతి ఇంట్లో సంతోషాన్ని సంపదను, సుఖశాంతులను నింపాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు గ్రీవెన్స్‌సెల్ రద్దు

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో, ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం దీపావళి పండగ సందర్భంగా రద్దు చేసినట్లు కలెక్టర్ డా.ఎన్. ప్రభాకరరెడ్డి, ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి తెలిపారు. ఆపై సోమవారం నుంచి యథావిధిగా పీజీఆర్ఎస్ నిర్వహించనున్నామని ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కోరారు.

పిడుగుపాటుతో ఆవు మృతి



పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు

తెర్లాం: మండలంలోని కవిరాయునివలస పంచాయతీ పరిధి బొంగుపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ఓ పాడిఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు మరిశర్ల ఆదినారాయణ తన ఆవును మేత కోసం పొలంలోకి ఆదివారం సాయంత్రం తొలుకుని వెళ్లాడు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసి ఒక్కసారిగా ఆవు మేస్తున్న ప్రదేశంలో పిడుగు పడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. పిడుగుపాటుకు గురై పాడిఆవు మృతి చెందడంతో ఆదినారాయణ కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



గణేష్ (ఫైల్)

శృంగవరపుకోట: పట్టణంలోని నడబంద పరిధిలో ఆదివారం తెల్లవారు జాము సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ప్రమాదంపై స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోతనాపల్లి గ్రామానికి చెందిన పూడి గణేష్(30) శనివారం రాత్రి ఎస్.కోటలో ఉన్నాడు. గణేష్ తెల్లవారు జామున 4గంటల సమయంలో నడబంద సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ దాటుతుండగా ట్రైన్ ఢీకొట్టగా గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు జీఆర్‌పీ ఎస్సై బాలాజీ ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ వి.నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వజన ఆస్పత్రికి నాణ్యత లేని మందులు

• పిండిలా మారిన మాత్రలు
• అవాక్కయిన రోగి



పౌడర్‌లా మారిన అమిట్రాపిన్ మాత్రలు

విజయనగరంఫోర్ట్: ఈ ఫొటోలోని స్ట్రిప్‌లో పిండిలా ఉన్న మాత్రలు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లిన రోగికి ఇచ్చినవి. మెడనొప్పి ఉండడంతో గంట్యాడ మండలంకు చెందిన సీహెచ్. బాల అనే రోగి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి శనివారం వెళ్లింది. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు మందులు రాసి ఫార్మసీలో తీసుకోమని చెప్పారు. అక్కడ మందులు తీసుకుని ఇంటికి వెళ్లి వాటిని తెరిచి చూడగా అమిట్రాపిన్ అనే మాత్రలు పిండిలా ముద్దయిపోయాయి. దీంతో వాటిని వేసుకోకుండా వదిలేసింది. ప్రజల ఆరోగ్యానికి కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న కూటమి సర్కార్ రోగులకు నాణ్యత లేని మందులు సరఫరా చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాణ్యత లేని మందులు వేసుకుంటే తమ ప్రాణాలకు ఏమోవుతుందోనని రోగులు ఆందోళన చెందుతున్నారు. పేద ప్రజలు ఎక్కువగా చికిత్స పొందే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు నాణ్యత లేని మందులు సరఫరా చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

మార్కెట్‌లో పెండలం

• ఆరంభమైన సీజన్
• పెరిగిన దిగుబడులు
• ఏజెన్సీలో వంద ఎకరాలకు పైగా సాగు



వ్యాపారులు కొనుగోలు చేసిన పెండలం



గిరిజనులు సీతంపేటలో విక్రయిస్తున్న పెండలం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో విస్తృతంగా పండే పెండలం సీజన్ ఈ ఏడాది ఆరంభమైంది. దిగుబడులు బాగా పెరిగినట్లు గిరిజనులు చెబుతున్నారు. మైదాన ప్రాంత వ్యాపారులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. అంతగా పెట్టుబడులు అక్కర్లేక పోయినప్పటికి ఈ పంట వేసుకుంటే మంచి ఆదాయవనరులు వస్తాయని గిరిజనులు తెలియజేస్తున్నారు. సీతంపేట, బామిని ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు వంద ఎకరాలకు పైగా కొండ పోడు వ్యవసాయంలో భాగంగా పెండలం పండిస్తారు. కావిళ్లలో కట్టలు కట్టి తీసుకువచ్చి గిరిజనులు విక్రయిస్తారు. ఒక్కో కట్ట రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నామని గిరిజనులు తెలిపారు. గతేడాది ఇదేసీజన్‌లో ఒక్కో కావిడి రూ.300ల వరకు విక్రయించేవారమని అంటున్నారు. ఇలా కొనుగోలు చేసిన వ్యాపారులు పట్టణాల్లోని మార్కెట్‌లో కిలోల వంతున కిలో రూ.90 వరకు విక్రయిస్తారు. ఒక్కో పెండలం కట్టకు రూ.200 వరకు ఆదాయం వస్తుందని గిరిజన రైతులు చెబుతున్నారు. అలాగే కందను కూడా బుట్టల లెక్కన ఒక్కో బుట్ట వంద వరకు కొనుగోలు చేస్తారు. మైదాన ప్రాంతాల్లో రూ.300ల వరకు అమ్మకాలు జరుపుతారు.

మైదాన వ్యాపారులదే హవా

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి పెండలం కొనుగోలు చేస్తారు.గతంలో సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసేవారు. అయితే కోవిడ్-19 కారణంగా వారపు సంతలు తగ్గాయి. నామమాత్రంగా అక్కడక్కడా జరుగుతున్నాయి. ఇక్కడికి వచ్చి గిరిజన రైతులు చెప్పిన ధరలు కాకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి కొన్ని సందర్భాల్లో ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరలకు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాల్లో గిరిజనులు ముందుగా దళారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటారు. పంట పక్వానికి వచ్చే సమయంలో ఆ పంటను వ్యాపారులకు ఇస్తారు. పాంద్ర, కొండాడ, చింతాడ, జగతపల్లి, అక్కన్నగూడ, బెన్నరాయి, గాటిగుమ్మడ, సీదిగూడ తదితర గ్రామాల్లో ఈ పంట ఎక్కువగా పండుతుంది.

గిట్టుబాటు ధర కల్పిస్తే బాగుంటుంది

కావిళ్లు మోసుకుని తీసుకువస్తాం. గిట్టుబాటు ధర లేకపోవడంతో తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తోంది. ప్రత్యేక మద్దతు ధరలు లేవు. దీంతో వ్యాపారులు నిర్ణయించిన ధరలకు అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు.

ఎస్.తోటయ్య, మూలగూడ

తవ్వితీయడం చాలా కష్టం

కొండపోడు వ్యవసాయంలో పెండలాన్ని పండిస్తాం. ఎంతో శ్రమకోర్చి పెండలాన్ని తవ్వితీస్తాం. వ్యాపారులు నిర్ణయించిన ధరలకు విక్రయించాల్సి వస్తోంది. ధరలు పడిపోవడంతో ఇప్పుడు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ఎస్.సుక్కయ్య, ఈతమానుగూడ

కార్పొరేట్ మతతత్వ శక్తులపై పోరాడదాం

• కడపలో మహాసభలను విజయవంతం చేయాలి
• సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పిలుపు



సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ అనంతరం వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన నాయకులు

విజయనగరం గంటస్తంభం: కార్పొరేట్ మతతత్వ మనువాద శక్తులను ప్రతిఘటించి, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వర్ధిల్లే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామనే పిలుపుతో, డిసెంబర్ 6,7 తేదీల్లో కడపలో జరగనున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ తొమ్మిదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం విజయనగరంలోని ఊటగెడ్డ వద్ద పార్టీ జెండాను జిల్లా కమిటీ విడుదల చేసిన కరపత్రాన్ని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు, బి.గిరిప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోరు విప్పడం లేదని విమర్శించారు. జీఎస్టీ శ్లాబ్ రేటు తగ్గించడం ద్వారా ధరలు తగ్గిపోయాయని, ఆదాయాలు పెరిగాయని పాలకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, వాస్తవానికి 18శాతం జీఎస్టీ శ్లాబ్ ఇప్పటికీ కొనసాగుతున్నప్పుడు ప్రజలపై మరింత భారం పడుతోందని తెలిపారు. ఎనిమిది సంవత్సరాలుగా లక్షల కోట్ల రూపాయల జీఎస్టీని వసూలు చేసి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో విప్లవ వామపక్ష ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి కడపలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని, అందుకు ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, యువత అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గౌతమి, పార్టీ నాయకులు జి.సత్యారావు, ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన నిమ్మక జితేంద్ర, బిడ్డిక హర్షవర్ధన్

గుమ్మలక్ష్మీపురం: జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం మండలం జొల్లగూడ గ్రామానికి చెందిన నిమ్మల జితేంద్ర, బిడ్డిక హర్షవర్ధన్ ఎంపికైనట్లు కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల పీడీ నిమ్మక మాధవరావు, ఎస్ఐఎస్ ఫెన్సింగ్ కోచ్ బాలరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈమేరకు ఈనెల 17వ తేదీన విజయనగరంలోని విజ్జి స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ బాల బాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీల్లో వీరిద్దరూ ఉత్తమ ప్రతిభ కనపరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, ఈనెల 18వ తేదీన కాకినాడలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా నిర్వహించిన 12వ సబ్ జూనియర్ అంతర జిల్లా బాల బాలికల ఫెన్సింగ్ పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చారని, వ్యక్తిగత విభాగంలో చూపిన ప్రతిభకు జితేంద్ర, హర్షవర్ధన్ కాంస్య పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో కూడా ఉత్తమంగా రాణించాలని పిలుపునిచ్చారు.

లొద్ద జలపాతం అభివృద్ధి చేస్తా



లొద్ద గిరిజనుల ముంగిట్లో కూర్చుని మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

• కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



లొద్ద జలపాతం వద్ద కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, అధికారులు

సాలూరు: కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం సాలూరు మండలంలోని లొద్ద ప్రాంత గిరిజనుల గూడాల్లో గిరిజనులతో మమేకమయ్యారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఆరా తీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గృహాలు లేని వారందరికీ గృహాలను మంజూరుచేస్తానని తెలిపారు. స్వచ్ఛమైన ప్రేమాభిమానాలకు గిరిజనులు మారుపేరని కితాబిచ్చారు. అనంతరం అతికష్టంమీద కొంత దూరం అటవీమార్గంగుండా కాలినడకన లొద్ద జలపాతానికి వెళ్లిన కలెక్టర్ ఆ జలపాతాన్ని చూసి మంత్రముగ్ధుడయ్యారు. అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఇటువంటి సుందరమైన ప్రాంతం పర్యాటకుల తాకిడితో సందడిగా మారాలని ఆకాంక్షించారు. లొద్ద జలపాతానికి పర్యాటకులు వచ్చేలా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ ప్రసూన, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ సర్వీసెస్ నూతన కమిటీ ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా రెవెన్యూ సర్వీసెస్ నూతన కమిటీ కార్యవర్గం

పార్వతీపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసి యేషన్(ఏపీఆర్ఎస్ఏ) పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా యూనిట్ పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర కమిటీ సూచనల మేరకు ఆదివారం పార్వతీపురంలో ఈ ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆదేశాలతో, ఎన్నికల అధికారిగా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, సహాయ ఎన్నికల అధికారిగా బీవీవీ ఎస్.రాజు, పరిశీలకుడిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ బంగార్రాజు వ్యవహరించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా కలెక్టరేట్ ఈఎఫ్‌జీ సెక్షన్ పర్యవేక్షకుడు గొట్టాపు శ్రీరామ్మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వీరఘట్టం తహసీల్దార్ ఎ.సాయి కామేశ్వరరావు, కోశాధికారిగా కలెక్టరేట్ సి.సెక్షన్ పర్యవేక్షకురాలు పి.సత్యలక్ష్మి కుమార్ ఎంపికయ్యారు.

నూతన కార్యవర్గంలో ముఖ్యులు వీరే..

సహాధ్యక్షులుగా పాలకొండ తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా ఎస్.శివన్నారాయణ(తహసీల్దార్, భామిని), పి. చిట్టెమ్మ(రీ-సర్వే ఉప తహసీల్దార్, సీతానగరం), ఎస్.శ్రీనుబాబు(ఆర్ఐ, సీతానగరం) ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె. శ్రీనివాసరావు (ఉపతహసీల్దార్, బలిజిపేట), క్రీడలు- సాంస్కృతిక కార్యదర్శిగా బి.శివరామకృష్ణ(ఆర్ఐ, గుమ్మలక్ష్మీపురం) బాధ్యతలు చేపట్టనున్నారు. వారితో పాటు పలువురు సంయుక్త కార్యదర్శులు, ఈసీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

పరమ పవిత్రం కార్తీకం

• కార్తీక దీక్ష శ్రేష్టం
• ఓ వైపు ముక్తి..మరో వైపు ఆరోగ్యం..
• నెలరోజుల దీక్షతో ఎన్నో ఫలితాలు..



కార్తీక పూజలకు సిద్ధమైన రాజాంలోని ఉమారామలింగేశ్వర ఆలయం



అంతకాపల్లి బాలాజీ టెంపుల్‌లో కార్తీక దీపారాధన(ఫైల్)



నాగావళి తీరంలో కార్తీక స్నానాలు (ఫైల్)

రాజాం: కార్తీకమాసం పవిత్రమైన మాసం. ఈనెల 22 నుంచి కార్తీక దీక్షలు, పూజలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అన్ని గ్రామాల్లో శివాలయాలు ఈ పూజలకు సిద్ధమయ్యాయి. కార్తీకమాసంలో చేపట్టే నెలరోజుల దీక్ష ఓ వైపు ముక్తిని, మరో వైపు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. కార్తీక దీపం ఎంతో పవిత్రమైనది. ఈ నెల రోజులు దీపం వెలిగించినా, ఆలయాల వద్ద, ఇండ్ల వద్ద వెలిగించిన దీపాన్ని దర్శించినా ఎంతో పుణ్యం కలుగుతుంది. ఈ కార్తీకంలో వేకువ జామున చేసే స్నానాలు శరీరానికి శక్తిని ఇస్తాయి. ఆయుష్షును పెంచుతాయి. దీర్ఘకాలిక రోగాలను నయం చేస్తాయి. దీపారాధనతో ఆధ్యాత్మిక భావనలో ఉన్నవారికి శాంతిభావం పెంపొందుతుంది. వనసమారాధనలు, సామూహిక భోజనాలు ఐక్యతను చాటుతాయి. శివ, కేశవులిద్దరికీ అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీకమాసం.

కార్తీక దీపం అంటే..

కార్తీకమాసంలో ప్రతిరోజూ సూర్యోదయానికి పూర్వమే నిద్ర లేచి స్నానమాచరించాలి. అప్పుడే అది కార్తీక స్నానమవుతుంది. నిత్యం దీపాన్ని వెలిగించినా, ఆరాధించినా, దీపం కార్తీకమాసంలో వెలిగించడం, నది, ప్రవహిస్తున్న సెలయేరుల్లో విడిచిపెట్టడం, ఆకాశ దీపాలను వెలిగించడం, దీపదానం చేయడం వంటి ఆచారాలు పాటించాలి. కార్తీకమాసమంతా ఇంటి ముందు గుమ్మానికి ఇరువైపులా సాయంకాలం దీపాలను వెలిగించాలి. అలాగే సాయంత్రం శివాలయాల్లో, వైష్ణవాలయాల్లో గోపుర ద్వారం వద్ద దేవుని సన్నిధానం, ప్రాంగణంలో దీపాలు వెలిగించిన వారికి సర్వపాపాలు హరిస్తాయని, వైకుంఠప్రాప్తి కలుగుతుందని శాస్త్ర వచనం చెబుతోంది.

దీపారాధనకు ప్రాముఖ్యం

ఈ నెలలో ఆలయాల వద్ద ఇతరులు వెలిగించిన దీపాలు ఆరిపోకుండా చూసినా పుణ్యప్రదమే. కార్తీక సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి తదితర దినాల్లో సాయం సమయాల్లో శివాలయాల్లో ఉసిరికాయపైన వత్తులు వేసి దీపం వెలిగించడం శ్రేష్టం. ఆవునెయ్యితో దీపం వెలిగించడం శ్రేష్టం. నువ్వుల నూనె, కొబ్బరి నూనె, అవిశనూనె, విప్ప నూనె, ఆముదంతోనైనా దీపాలు వెలిగించాలి.

నెలరోజుల దీక్ష..

కార్తీక స్నానాన్ని ఆశ్వయుజ బహుళ అమావాస్య దీపావళి రోజు నుంచి ప్రారంభించచాలి. నెలంతా కార్తీకస్నానం చేయడం మంచిది. వీలుకాని వారు సోమవారాల్లోనూ, శుద్ధ ద్వాదశి, చతుర్దశి, పౌర్ణమి రోజుల్లోనైనా తప్పక ఆచరించాలి. శుద్ధ ద్వాదశినాడు తులసి పూజచేయాలి. ఈ నెలంతా శ్రీ హావిష్ణువును తులసీదళాలు, జాజిపూలతో పూజించాలి. ఈ నెలంతా శివుడిని మారేడు దళాలు, జిల్లేడు పూలతో పూజించాలి. ఈ మాసంలో కార్తీక పురాణాన్ని పారాయణం చేయడం మంచిది. కార్తీకంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యం ఉంది.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 43 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నెల్లిమర్ల: స్థానిక రామకృష్ణధ్యాన మందిరంలో జిల్లా స్థాయి యోగాసనాల పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది హాజరయ్యారు. వారిలో 43 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బూర్లె శ్రీధర్ తెలిపారు. వారంతా ఈనెల 25,26 తేదీల్లో విశాఖపట్నంలోని వెంకోజీ పాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో యోగా టీచర్లు సన్యాసిరావు, నడుపూరు పైడిరాజు, మద్దిల సంతోషి భారతి పాల్గొన్నారు.

చేతకాని మంత్రికి రెండు పదవులు అవసరమా?

• మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
• నియోజకవర్గంలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సవాల్



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: గిరిజనులకు అండగా నిలవలేని, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎమ్‌ల నియామకంపై తొలిసంతకం చేసి నేటికీ అమలుచేయలేని మంత్రి సంధ్యారాణికి రెండు పదవులు అవసరమా? మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. గిరిజన విద్యార్థుల మరణాలపై పభుత్వం చోద్యం చూస్తుండగా, ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలకు పదిలక్షల రుపాయలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నార న్నారు. కాగా జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలపై మంత్రి సంధ్యారాణి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నేతలు రాజకీయం చేస్తున్నారంటూ విమర్శలు చేస్తారా? అంటూ మంత్రి సంధ్యారాణిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్త్రీశిశుసంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల మంత్రిగా పనిచేస్తున్న ఆమె తన శాఖలకు న్యాయం చేయలేక అసమర్థ మంత్రిగా నిలిచారని, పదవులకు న్యాయంచేయలేని మీకు రెండు పదవులు అవసరమా? అంటూ మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గురుకులాల్లో తాము ఏఎన్ఎమ్‌ల నియామకం చేపట్టామని, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎమ్‌ల నియామకంపై తాను ఫైల్ పెట్టానని, సీఎం వద్ద ఫైలు ఉండగా ఎన్నికలు వచ్చాయని కావాలంటే వారు ఆఫైల్‌ను తెప్పించుకోవచ్చ న్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము మంజూరుచేసిన రోడ్ల పనులు, ఆ బిల్లులు జరగాలన్నా ఆ ప్రాంతాల గిరిజన నాయకులు తమ పార్టీలోకి వస్తేనే బిల్లులు అవుతాయంటూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరి హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందో అందరికీ తెలుసునని, అభివృద్ధి విషయంలో బహిరంగ చర్చకు తానెప్పుడూ సిద్ధమని, మీరెక్కడికి రమ్మంటే అక్కడికి తాను చర్చకు వస్తానని సవాల్ విసిరారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడేవన్నీ అబద్ధాలేనని, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో కూటమి ప్రభుత్వంలో 14 మంది గిరిజన విద్యార్థులు మరణించడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, ఇకనైనా మంత్రి సంధ్యారాణి విమర్శలు మానుకుని హుందాగా రాజకీయాలు చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రియల్ మోసంపై..స్పందించిన అధికారులు..



చిననడిపల్లిలో అనుమతులు లేని వెంచర్‌లో పరిశీలిస్తున్న ఎంపీడీఓతో పాటు ఇతర అధికారులు

చీపురుపల్లి: మండలంలోని చిననడిపల్లి రెవెన్యూ పరిధిలో అనుమతులు లేకుండా వెలసిన మెగా వెంచర్ మోసంపై అధికారులు స్పందించారు. చిననడిపల్లి రెవెన్యూ పరిధిలోని మెగా వెంచర్‌కు ఎలాంటి అనుమతులు లేవని ఆదివారం 'సాక్షి' పత్రికలో 'రియల్‌గా మోసం' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనికి ఎంపీడీఓ ఐ.సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది స్పందించారు. ఆదివారం చిననడిపల్లి పరిధిలోని అనుమతులు లేని మెగా వెంచర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సురేష్ మాట్లాడుతూ అనుమతి లేని లేఅవుట్‌కు సంబంధించిన యజమాని అందుబాటులో లేరని చెప్పారు. అయితే ఎలాంటి అనుమతులు లేని ఈ వెంచర్‌లో ఎవ్వరూ ప్లాట్లు కొనుగోలు చేయకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని ఆదేశించినట్లు చెప్పారు. అంతేకాకుండా అనుమతులు లేని ఇక్కడి లే అవుట్‌కు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని వీఎంఆర్‌డీఏకు సూచనలు తెలియజేస్తూ నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. అలాగే సదరు వెంచర్ అభివృద్ధిని తక్షణమే నిలుపుదల చేయాలని సంబంధిత వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు.

57వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న సుభాష్

విజయనగరంఫోర్ట్: నగరానికి చెందిన భవిరెడ్డి సుభాష్..57వ సారి రక్తదానం చేసి తనలోని మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయన్న విషయం తెలుసుకున్న ఆయన తనవంతు సాయంగా ఓ యూనిట్ రక్తం దానం చేసి సాయం చేశారు. ప్రాణాపాయ స్థితిలో రక్తం అవసరమైన వారికి మనమిచ్చే రక్తం అందితే వారి ప్రాణాలు నిలబడతాయని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకురావాలని ఆయన కోరారు. సుభాష్ ఏడాదికి నాలుగు సార్లు రక్తం దానం చేస్తూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తుండడం అభినందనీయమని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గోవింద్ అన్నారు.